తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
సోమవారం
05 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

నిలిచిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

# లబ్ధిదారుల్లో ఆందోళన!

- మిర్యాలగూడలో మంత్రి, ఎమ్మెల్యే పంపిణీ చేసినా క్షేత్రస్థాయిలో దక్కని ఫలాలు
- కొంతమందికే ఇచ్చి చేతులు దులుపుకున్న వైనం
- అధికారుల మౌనం వెనుక మర్మమేంటి? అని నిలదీస్తున్న ప్రజలు




**మాడుగులపల్లి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసిన ప్పటికీ, మాడుగులపల్లి మండలంలో మాత్రం దానికి పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి మండల పరిధిలో ఇప్పటివరకు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డులు అందక పోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా, స్థానిక ఎమ్మెల్యే భక్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని వైభవంగా ప్రారంభించారు అయితే, నియోజకవర్గ స్థాయిలో వేదికపై కొద్దిమందికి మాత్రమే కార్డులు అందించి చేతులు దులుపుకున్నారని, క్షేత్రస్థాయికి వచ్చేసరికి పంపిణీ ప్రక్రియ పూర్తిగా మందగించిం దని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మాడుగుల పల్లి మండలంలోని పలు గ్రామాల్లో మాకు స్మార్ట్ రేషన్ కార్డులు ఎప్పుడు వస్తాయి? అంటూ లబ్ధిదారులు నిత్యం కార్యాల యాల చుట్టూ తిరుగుతూ వేచి చూసే పరిస్థితి నెలకొంది పక్క నియోజకవరా ్గల్లో, ఇతర మండలాల్లో కార్డులు అంద రికీ అందుతున్న వేళ, తమ మండలం లోనే ఎందుకుఈ నిర్లక్ష్యం అని గ్రామస్తు లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల దాటవేత ధోరణి వెనుక ఉన్న రహస్యమేంటి?**

రేషన్ కార్డుల పంపిణీ ఆలస్యం కావడంపై గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీస్తుంటే, స్పష్టమైన సమాధానం చెప్పలేక అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని సమాచారం కార్డుల ముద్రణలో ఆలస్యమా? పంపిణీ యంత్రాంగంలో సమన్వయ లోపమా? లేక ఇతర రాజకీయ కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో మండల వ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి అధికారులు రేషన్ కార్డులు పంచకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏంటో తేలాలని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు మరియు స్థానిక ఎమ్మెల్యే భక్తుల లక్ష్మారెడ్డి గారు స్పందించి మాడుగులపల్లి మండలంలో తక్షణమే పూర్తిస్థాయి లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



# గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

**ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృన్ శ్రేష్ట**

**భద్రాచలం అక్టోబరు 04 (జనంసాక్షి)**

భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈకార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని, సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు తప్పనిసరిగా భద్రాచలం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లోని సమావేశ మందిరాలకు సకాలంలో హాజరుకావాలని పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట స్పష్టం చేశారు.



అశ్వాపురంలో కలకలం!

# మైనర్ బాలికపై అత్యాచారయత్నం

- ఇంటికి దింపుతానంటూ బైక్‌పై ఎక్కించుకుని దారిలో లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు
- బీఆర్ఎస్‌కు చెందిన రాయల కోటేశ్వరరావు నిందితుడిగా పోక్సో కేసు
- ఆగ్రహంతో నిందితుడిపై దాడి చేసిన 14 మంది బంధువులపైనా కేసు

**అశ్వాపురం, అక్టోబర్ 4 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బుడుగు బజార్‌లో మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన రాయల కోటేశ్వరరావుపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆడపిల్లల భద్రతపై మరోసారి ఆందోళన కలిగించేలా

మిగతా 2లో

ప్రజావాణికి అధికారులు సకాలంలో

# హాజరు కావాలి

**కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 05 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి

మిగతా 2లో

# దారి వివాదం పై రైతు ఆవేదన

**ఒప్పందం ఉల్లంఘించి బైండవర్ చేసిన కడీలు ను తొలగించారని ఆరోపణ**



**ఆత్మకూర్(ఎం) జనంసాక్షి :** మండలంలోని పల్లెర్ల పరిధి సిద్ధాపురానికి చెందిన రైతు ఏనుగు గౌతంరెడ్డి దారి వివాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లి ఏనుగు వనజాత పేరున ఉన్న సర్వే నంబర్ 485లోని భూమికి, పక్కనే ఉన్న సర్వే నంబర్ 466 భూమికి మధ్య దారి కోసం ఒప్పందం చేసుకుని రిజిస్ట్రేషన్ ద్వారా మార్గం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అయితే కొది ్దరోజులకే కడీలను తొలగించారని ఆరోపించారు. సమస్య పై ఉన్నతాధికారులను ఆశ్రయించి న్యాయం చేయాలని తెలిపారు.

**భూ యజమాని గౌతమ్ రెడ్డి**

సెప్టెంబర్ 30 వ తేదీ న రాత్రి సమయంలో గౌతమ్ రెడ్డి లేని సమయం లో బైండవర్ లో వున్న కడిలను రాత్రికి రాత్రి తొలిగించారు. ఈ విషయం పై స్థానిక తహసీల్దార్ కు ఎస్సై కి ఫిర్యాదు చేయడం జరిగింది. బైండవర్ లో వున్న నా కడిలను తొలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇట్టి భూమి విషయం పై నాదే తప్పు అని ఆరోపణలు చేస్తున్నారు నిజంగా నాదే తప్పు వుంటే రాత్రికి రాత్రి కడిలను ఎందుకు తొలిగించారు అని అన్నారు.

వార్తా లోపలి పేజీలో

# చేపల విక్రయదారుడిగా మారిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**వృత్తిలోని కష్టసుఖాలను స్వయంగా తెలుసుకున్న ప్రజాప్రతినిధి**



**చంద్రుగొండ, అక్టోబర్ 4 (జనం సాక్షి):** అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం చంద్రుగొండ మండల కేంద్రంలోని రావిచెట్టు వద్ద జరిగిన వారపు సంతను సందర్శించారు. ఇటీవల అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి తిరిగి వస్తున్న క్రమంలో సంతలో చేపల విక్రయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చేపలు విక్రయిస్తున్న వ్యాపారుల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే వారి రోజువారీ జీవన విధానం, చేపల కొనుగోలు, రవాణా, నిల్వ, శుభ్రపరిచే ప్రక్రియ, ధరలు, అమ్మకాల పరిస్థితులు, ఆదాయం?ఖర్చులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా చేపలను శుభ్రం చేస్తూ చేపల విక్రయ వృత్తిలో ఉండే కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునే ప్రయత్నం చేశారు. చేపల వ్యాపారం కేవలం అమ్మకాలకే పరిమితం కాకుండా తెల్లవారుజామునే చేపలను సమకూర్చుకోవడం, వాటిని సురక్షితంగా నిల్వ చేయడం, పరిశుభ్రతను పాటిస్తూ వినియోగదారులకు శుభ్రం చేసి అందించడం వంటి అనేక శ్రమతో కూడుకున్న పనులతో ముడిపడి ఉందని ఈ సందర్భంగా చర్చించారు. సంతలో ధరలు, అమ్మకాలపై కూడా వ్యాపారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, అశ్వరావుపేట నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ భక్ష్, కడియాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాల్వాయి చెరువు చేపల వేలం పాటలో అక్రమాలు

## నిబంధనలు ఉల్లంఘించి హైదరాబాద్‌కు అక్రమ రవాణా!



**గుర్రంపోడు, అక్టోబర్ 4 (జనంసాక్షి):** గుర్రంపోడు మండల పరిధిలోని పాల్వాయి గ్రామంలో చేపల వేలం పాటను ఆసరాగా చేసుకొని కొందరు బేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న అక్రమ దందా స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ నిబంధనలను, మత్స్యకార సహకార సంఘం (సొసైటీ) బైలాస్‌ను పూర్తిగా బేఖాతరు చేస్తూ, వేలం పాట ముసుగులో అధికారిక అనుమతులు లేకుండా టన్నుల కొద్దీ చేపలను హైదరాబాద్ మహానగరానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**వేలం నిబంధనలు తుంగలో తొక్కి రాత్రికి రాత్రే రవాణా:**

నియమ నిబంధనల ప్రకారం చెరువులో చేపల వేలం పాట పాడిన తర్వాత, సేకరించిన మత్స్య సంపదను రవాణా చేయడానికి మత్స్య శాఖ లేదా స్థానిక సొసైటీ నుండి అధికారిక అనుమతి పత్రాలు , రాయల్టీ చెల్లింపుల రశీదులు తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా, స్థానిక మార్కెట్ అవసరాలను గుర్తించి, ఇక్కడి వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ, పాల్వాయి గ్రామంలో వేలం పాడిన కొందరు వ్యాపారులు, దళారులుగా మారి ఎలాంటి పర్మిట్లు లేకుండా ఎక్కువ లాభాల కోసం రాత్రికి రాత్రే వాహనాలలో చేపలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. లీగల్ వేలం పాట పేరుతో ఇక్కడ ఇల్లీగల్ ట్రాన్స్‌పోర్ట్ దందా నడుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.గ్రామం నుండి ప్రతిరోజూ అక్రమ రవాణా వాహనాలు వెళ్తున్నా, స్థానిక అధికారులు కనీసం అటువైపు



చూడకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలం పాట నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సాగుతున్న ఈ అక్రమ రవాణాపై మత్స్య శాఖ మరియు పోలీస్ అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. పాల్వాయి చెరువు వద్ద తనిఖీలు చేపట్టి, అక్రమ వాహనాలను సీజ్ చేయాలని, బాధ్యులైన బేరగాళ్లపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# దారి వివాదం పై రైతు ఆవేదన



**ఎస్ఐ లక్ష్మీనారాయణ వివరణ:**

గౌతమ్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ను తీసుకోని విచారణ చేస్తున్నాము అని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. న్యాయం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**తహసీల్దార్ వి.లావణ్య వివరణ:**

సిద్ధాపురంలో సర్వే నంబర్లు 465, 466లో బాట వివాదం నడుస్తోందని తెలిపారు. ఇరువర్గాల రైతులు గొడవలు పడవద్దని వారిని బైండోవర్ చేశామని, అలానే బైండోవర్ స్థలము లో కడీలను తొలిగించారు అని గౌతమ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. త్వరలోనే ఘటనా స్థలాన్ని పరిశీలించి కడీలను తొలిగించిన వారి పై చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు.

# ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : కలెక్టర్ అంకిత్

అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# మైనర్ బాలికపై అత్యాచారయత్నం.. అశ్వాపురంలో కలకలం!

ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. భద్రాచలంలో ఇంటర్ చదువుతున్న మైనర్ బాలిక రామచంద్రాపురం బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో బైక్‌పై అక్కడికి వచ్చిన నిందితుడు రాయల కోటేశ్వరరావు.. బాలికను ఇంటి వద్ద దింపుతానని చెప్పి బైక్‌పై ఎక్కించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతదూరం వెళ్లిన అనంతరం బైక్‌ను ఆపి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే బాలిక నిందితుడి నుంచి తప్పించుకుని అక్కడి నుంచి బయటపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**విషయం తెలుసుకున్న బంధువుల ఆగ్రహం**

ఘటన విషయం తెలుసుకున్న బాలిక బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురై నిందితుడు రాయల కోటేశ్వరరావుపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ దాడి ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది బాలిక బంధువులపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఒకవైపు మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాయల కోటేశ్వరరావుపై పోక్సో కేసు నమోదు కాగా.. మరోవైపు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నిందితుడిపై దాడి చేసిన వారిపైనా పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

‘ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి’

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారయత్నాలకు పాల్పడే వారిపై చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఆడపిల్లల భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై దర్యాప్తు వేగవంతం చేసి, ఆరోపణలు రుజువైతే చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మేళ్లచెరువులో ‘అంగన్ మిలన్ సేవ’ కార్యక్రమం

మేళ్లచెరువు జనం సాక్షి న్యూస్



దేశాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవ భారత నిర్మాణానికై కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా సేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ‘సేవా సంకల్ప్ అభియాన్’ లో భాగంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో ‘అంగన్ మిలన్ సేవ’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సూర్యాపేట జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ఎర్రమాసు కళావతి, మండల పార్టీ అధ్యక్షులు గుండెబోయిన వీరబాబు, మండల మహిళా మోర్చా నాయకులు చిట్టా రాజ్యలక్ష్మి, మిట్టపల్లి కోటమ్మ, చట్టా నాగిరెడ్డి, తోడేటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు వివాదంలో మురుగునీటిలో ధర్మాపురం ఎస్సీ కాలనీ

- **రెండు గ్రామాల సరిహద్దు వివాదంలో డ్రైనేజీ కాలువ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ధర్మాపురం ఎస్సీ కాలనీవాసులు!**
- **తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలించని వినతులు అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం**








**మాడ్గులపల్లి సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజలు తీవ్రమైన డ్రైనేజీ సమస్యతో నరకయాతన అనుభవిస్తున్నారు ఒకవైపు మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక వీధులన్నీ చెరువులను తలపిస్తుంటే, మరోవైపు సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**గతంలో పోసినా ఇటీవల పొడిగించినా తీరని అవస్థలు**

ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో సిమెంట్ కాలువను నిర్మించారు. నీటి ప్రవాహం సులువుగా సాగాలనే ఉద్దేశంతో ఇటీవల కాలువను మరికొంత పొడిగించి పనులు పూర్తి చేశారు. అయితే, కాలువ నిర్మాణం పూర్తయినప్పటికీ మురుగునీరు ముందుకు వెళ్లకుండా కాలువ మధ్యలోనే మట్టిని నింపి పూడ్చివేశారు దీంతో డ్రైనేజీ నీరంతా ఇళ్ల ముందే నిలిచిపోయి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది.

**రెండు గ్రామాల సరిహద్దుల చిక్కుముడి**

ఈ డ్రైనేజీ మురుగునీరు గ్రామం దాటి బయటకు వెళ్లాలంటే రెండు గ్రామాల రెవెన్యూ పరిధికి సంబంధించిన సరిహద్దు మార్గం కీలకంగా మారింది ఈ హద్దు వివాదం కారణంగానే కాలువలో మట్టి పూడ్చడం, నీళ్ల ప్రవాహాన్ని అడ్డుకోవడం జరిగింది గ్రామ స్థాయిలో ఎంత నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో సమస్య మరింత సంక్లిష్టంగా మారింది.

**అధికారుల చుట్టూ తిరిగినా దక్కని పరిష్కారం!**

ఈ తీవ్రమైన సమస్యపై స్థానిక పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ మండల స్థాయి అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని భావించారు ఇందులో భాగంగా బాధితులు, ప్రజాప్రతినిధులు వినతిపత్రం ఇచ్చేందుకు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లగా ఈ సమస్య పంచాయతీకి సంబంధించినది కాబట్టి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వాలని అక్కడి సిబ్బంది సూచించినట్లు విశ్వసనీయ సమాచారం తీరా ఎంపీడీవో కార్యాలయానికి వెళ్తే, ఇది రెండు గ్రామాల సరిహద్దుల రెవెన్యూ సమస్య కాబట్టి తహశీల్దార్ కార్యాలయంలోనే ఫిర్యాదు చేయాలని తిప్పి పంపినట్లు తెలుస్తోంది ఇలా ఏ కార్యాలయానికి వెళ్లినా అధికారులు ఒకరిపై ఒకరు నెట్టేసుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**విజృంభిస్తున్న విషజ్వరాలు తీవ్ర భయాందోళనలో స్థానికులు**

డ్రైనేజీ కాలువలో నీరు నిలిచిపోయి కుళ్ళిపోతుండటంతో కాలనీ అంతటా దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనివల్ల డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి భయంకరమైన విషజ్వరాలు విరుచుకుపడుతున్నాయి. కాలనీలోని చిన్నారులు, వృద్ధులు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవుతుండటంతో పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి

**ఏది ఏమైనా తక్షణమే అధికారులు స్పందించాలి**

కార్యాలయాల చుట్టూ తిరగడానికే సరిపోతోందని, ఇప్పటికైనా మండల ఉన్నతాధికారులు, రెవెన్యూ మరియు పంచాయతీ రాజ్ యంత్రాంగం సమన్వయంతో స్పందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి సరిహద్దుల సర్వే నిర్వహించి హద్దులు స్పష్టం చేయడంతో పాటు, డ్రైనేజీ కాలువలో పూడ్చిన మట్టిని అధికారులే స్వయంగా జోక్యం చేసుకుని తొలగించాలని కోరుతున్నారు. నిర్లక్ష్యం వీడి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు.

# 44 ఏళ్ల తర్వాత ఒక్కటైన ఆత్మీయ బంధం

## సుబ్లేడు హైస్కూల్ 1976 - 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**తిరుమలాయపాలెం అక్టోబర్ 4 (జనంసాక్షి)**
మానవ సంబంధాలు దూరం అవుతున్న సమయంలో నాలుగు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా చెదరని స్నేహబంధం వారిని మళ్లీ ఒక్కచోట చేర్చింది. సుబ్లేడు హైస్కూల్‌లో 1976?1981 సంవత్సరాల మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు 44 సంవత్సరాల తర్వాత అప్పుడు చదివిన అదే సుబ్లేడు స్కూల్లో ఆత్మీయంగా ఆదివారం కలుసుకుని అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దాదాపు అందరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రైవేటు రంగాల్లో వ్యాపారాలలో స్థిరపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరూ రిటైర్మెంట్ అయ్యారు. వారి కుటుంబ బంధాలను తెలియజేస్తూ స్నేహితులతో సంతోషంగా గడిపారు. 44 సంవత్సరాల క్రితం సుబ్లేడు స్కూల్లో అప్పటి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి గురువులు, పాఠశాల, తరగతి గదులు, ఆటపాటలు, కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుని ఆనందంగా ముచ్చటించుకున్నారు. వయసు పెరిగినా స్నేహానికి వయసు లేదని నిరూపిస్తూ,



అప్పటి ఆప్యాయతను నేటికీ కొనసాగించడం పట్ల పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. 44 ఏళ్ల విరామం తర్వాత కలుసుకున్న స్నేహితుల్లో ఆనందం ఎల్లలు దాటింది. కొందరు భావోద్వేగానికి లోనై చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలను మరొకరు తెలుసుకుంటూ, ఇకపై కూడా తరచూ కలుసుకుంటూ ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు.
ఈ సమ్మేళనం తమ జీవితంలో మరచిపోలేని మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కాలం గడిచినా.. దూరాలు పెరిగినా.. నిజమైన స్నేహానికి ఎల్లలు ఉండవని ఈ ఆత్మీయ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు విటల్ రావు.. రాధాబాయి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకు శశిధర్, వెంకటేశ్వరరావు, అస్గర్ ఖాన్, ప్రసాద్, భువనగిరి వెంకటేశ్వర్లు, గంధసిరి మల్లయ్య తూమట్ల విజయకుమార్ డీలర్ వెంకన్న, రామ్ రెడ్డి, సీత, శారద, చంద్రకళ, విజయ్ కుమార్, రాగ్య నాయక్, శ్రీరాములు, గంధసిరి లాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ట్రస్మా బీబీనగర్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**బీబీనగర్ (జనంసాక్షి):**
బీబీనగర్ మండల ట్రస్మా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవులపల్లి బ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా చింతపట్ల నాగరాజు, కోశాధికారిగా నెల్లూరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా జోమన్ కె. జాన్స్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ట్రస్మా జిల్లా నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం అధ్యక్షులు దేవులపల్లి బ్రహ్మం మాట్లాడుతూ మండలంలో ట్రస్మా పటిష్టతకు పాటుపడతామని, ప్రైవేట్ పాఠశాలలకు ట్రస్మా పెద్దన్న పాత్ర పోషిస్తూ సమస్యలను పరిష్కరిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు ఈసారపు అచ్చయ్య గౌడ్, గొట్టిపర్తి భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకురాలు వైష్ణవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు



**సూర్యాపేట (జనంసాక్షి):**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్యాపేట సర్కిల్ పరిధిలోని జమ్మిగడ్డ సబ్ స్టేషన్ ప్రాంగణంలో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యుత్ వినియోగదారులు హాజరై పథకానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు పథకం కోసం నమోదు చేసుకున్నారు. ఎస్ఈ పి.యాదగిరి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సర్కిల్ ఎస్ఈ పి.యాదగిరి, డీఈ టెక్నికల్ ఎన్.వెంకటకృష్ణయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ సిబ్బంది, ఆపరేషన్ ఏడీలు, ఏఈలు, రెడ్కో శాఖ, బ్యాంక్ సిబ్బంది, వివిధ యూనియన్ నాయకులు, విద్యుత్ వినియోగ దారుల సేవా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# రహదారిపై చెత్త వేయొద్దు

## చెట్ల తొలగింపు చేపట్టిన సర్పంచ్

**వలిగొండ, అక్టోబర్ 5 (జనంసాక్షి)**
వలిగొండ - దాసిరెడ్డిగూడెం రహదారి ఇరువైపులా చెత్తాచెదారం వేయడంతో పాటు చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి పాదరక్షకులు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెత్తకు ఆకర్షితమవుతున్న కోతులు, కుక్కలు రోడ్డుపైకి వచ్చి వాహనదారులను, పాదరక్షకులు ను అడ్డుకుంటూ దాడులకు పాల్పడుతున్నాయి. సమస్యను గుర్తించిన దాసిరెడ్డిగూడెం సర్పంచ్ రాపోలు గోపి రహదారి ఇరువైపులా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపి మాట్లాడుతూ... రహదారి వెంట ఎవరూ చెత్త వేయవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల భద్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్పిడి వెంకట్ రెడ్డి, నారి రమేష్, మత్స్యగిరి తదితరులు ఉన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

## మాజీ శాసనసభ్యులు, డాక్టర్ గాదరి కిషోర్ కుమార్

**తుంగతుర్తి అక్టోబర్ 4 (జనంసాక్షి)**
వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు, ఇప్పటికే ఓటరుగా నమోదుగా చేసుకునేందుకు అవకాశం



ఉందన్నారు, ఎన్నికలలో ఓటు హక్కు పొందేందుకు ఫారం 18 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు, సెప్టెంబర్ 26 నుండి నవంబరు ఆరు వరకు అభ్యంతరాల నమోదు, నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు ఓటర్ల తుది జాబితా ప్రచురనా ఉంటుందని తెలిపారు, మీ ఫోటో, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్, మొబైల్ నెంబర్, తదితర వివరాలు ఆప్షన్ లో నమోదు చేయాలన్నారు, గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు చేసుకోవడం వల్ల ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడానికి ఉపయోగపడు తుందన్నారు, త్వరలో పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ నమోదుపై హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# అభయహస్తం' అమలుకై 5న బైక్ ర్యాలీ

## ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు బొట్ల పరమేష్ మాదిగ

**మోటకొండూరు, అక్టోబరు 4 (జనం సాక్షి):**
అభయహస్తం పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం మోటకొండూరు మండల అధ్యక్షుడు బొట్ల పరమేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీ అడ్డగూడూరు నుంచి ప్రారంభమై




భువనగిరి జిల్లా కేంద్రం వరకు కొనసాగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సోదరులు, యువత పెద్ద ఎత్తున తమ తమ వాహనాలతో తరలివచ్చి ఈ బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**సూర్యాపేట(జనంసాక్షి):**
వయోవృద్ధుల భద్రత, గౌరవం, ఆరోగ్యం, పోషణ, సంరక్షణ రంగాల్లో విశిష్ట సేవలందించిన తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుడుగుంట్ల విద్యాసాగర్‌కు రాష్ట్ర ఉత్తమ సామాజికవేత్త అవార్డు లభించిన సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గల అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు విద్యాసాగర్ కు అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, దండ వెంకటరెడ్డి, కొప్పుల మోహన్‌రావు, కందిబండ సూరయ్య, ఈదుల శంకరయ్య, వెంపటి సురేష్, కాకి మల్లారెడ్డి, చల్లా చౌకా రావు, వెంకన్న, అన్నపూర్ణమ్మ, లక్ష్మమ్మ, సుగుణ, పాపారావు, వీరయ్య, వెంకటేశ్వర్లు, నరసయ్య, సైదులు, కృష్ణయ్య, బొలిశెట్టి వీరయ్య, బిక్షమయ్య, లింగా



రావు, విజయ్‌కుమార్, నరసయ్య, నాగయ్య, సైదమ్మ, రాధాకృష్ణ, కందిమల్ల రామ నరసయ్య, ధనమ్మ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

## టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్




**ఉల్లాసంగా జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభించిన నాగా సీతారాములు యాదవ్**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 ( జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలకు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఒలింపిక్ జెండాను ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు యాదవ్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, బాలురతో పాటు బాలికలు కూడా అధిక సంఖ్యలో అథ్లెటిక్స్‌లో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం అభినందనీయ మన్నారు. అథ్లెటిక్స్ ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహం, మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.. కార్యక్రమంలో మహీధర్ రెడ్డి, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ మందుల వెంక టేశ్వర్లు, అథ్లెటిక్స్ కోచ్ డి. మల్లికార్జునరావు, కోచ్‌లు ఎం. నాగరాజు, పి. నాగేందర్, జె. గిరిప్రసాద్, షేక్ రియాజ్ పాషా, కిన్నెరసాని ప్రసాద్, ఐటీడీఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ నారాయణ, ఈశ్వర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రెజరర్ బి. హనుమంతరావు, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంజులాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మ రూరల్ మండలం రేషన్ డీలర్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధారాణి, వినోద్ కుమార్‌లు ఎన్నిక

**ఖమ్మం రూరల్ అక్టోబర్ 4 (జనంసాక్షి):** రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు అనుబంధంగా ఖమ్మం రూరల్ మండలం గ్రామీణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం రూరల్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఖమ్మం రూరల్ మండలం గౌరవ అధ్యక్షులుగా ఎల్లంపల్లి యాదగిరి,అధ్యక్షులుగా గుడిసె సుధారాణి ,ప్రధాన కార్యదర్శిగా చెక్కల వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కొమరబత్తిన బాలరాజు ,సహాయ కార్యదర్శిగా దండేల రవీందర్ ,కోశాధికారిగా శబాష్ కన్నా రెడ్డి, ప్రచార కార్యదర్శిగా లింగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బి దర్గయ్య ,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జానీమియా, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎల్లంపల్లి యాదగిరిలు హాజరై మాట్లాడారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి నాయకోటి రాజు ఆధ్వర్యంలోని యూనియన్ ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. ఖమ్మం జిల్లాలో రేషన్ డీలర్ల సంక్షేమమే లక్ష్యంగా తమ సంఘం ముందుకు నడుస్తుంది అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుండి రావలసిన కమిషన్ను సకాలంలో అందే విధంగా కృషి చేస్తామన్నారు. రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రేషన్ డీల్ రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు మందటి వెంకటరమణ, నరసింహారావు, ఆంజనేయులు, లింగరాజు, సునీత తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతనకల్ మండల ఉపసర్పంచుల ఫోరం ఎన్నిక

### అధ్యక్షులుగా నాగం సరిత సుధీర్ రెడ్డి

**నూతనకల్ అక్టోబర్ 4 ( జనంసాక్షి)**

మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఉపర్పంచులు ఉమాదేవి ఫంక్షన్ హాల్ లో సమావేశమై ఉప సర్పంచుల సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు.ఈ సమావేశానికి వర్కింగ్ ప్రెసిడెంట్ బందు యాకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వారి ఆధ్వర్యంలో నాగం సరిత సుధీర్ రెడ్డి ని నూతనకల్ మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆ సంఘ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు మండల అధ్యక్షులుగా ఎన్నికైన నాగం సరితను వారు అభినందించారు. మండలంలో గ్రామాల అభివృద్ధి, ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం, స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నేనావత్ సురేంద్రనాయక్, కార్యదర్శిగా సామ సురేందర్ రెడ్డి,కోశాధికారిగా గంట నాగమణి రవిశంకర్, ఉపాధ్యక్షులు గా గోరంట్ల వెంకన్న,వర్కింగ్ ప్రెసిడెంట్ గా వల్లమల్ల నరేష్, కార్యవర్గ సభ్యులుగా నారాయణ మరికంటి ఎఅనసూయ మంగళపల్లి నారాయణ జ్యోతి ధారావత్ వేల్పుల స్వరూప పాల్వాయి నాగరాజ్ దుండుగల భూలక్ష్మి తదితర ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

## జిల్లా అటవీ శాఖ అధికారులు సూర్యదేవాలయ సందర్శన

**జాజిరెడ్డిగూడెం మండల అక్టోబర్ 4 ( జనంసాక్షి)**

జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని ఆదివారం జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) దామోదర్ రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా క్షేత్రంలో సూర్యనారాయణస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర విశిష్టతను వ్యవస్థాపకులు కాకులారపు రజితజనార్ధన్ స్వామి తెలియజేశారు. ఈకార్యక్రమంలో రేంజ్ అధికారి కిరణ్‌కుమార్, సూర్యాపేట సెక్షన్ అధికారిణి మంజుల, బీట్ అధికారి అనిల్, వాచర్ బొబ్బలి వెంకన్న పాల్గొన్నారు.



## పోచంపల్లి చేనేత కళకు ఈఓ వినోద్‌రెడ్డి ప్రశంసలు

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 4 (జనం సాక్షి):** బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈఓ వినోద్‌రెడ్డి భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని పరిశీలించారు. చేనేత మగ్గాలు, ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియను ఆసక్తిగా తిలకించి, నేత కార్మికుల నైపుణ్యాన్ని అభినందించారు. పోచంపల్లి చేనేత కళ, సంస్కృతి, సంప్రదాయాలు దేశ, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీటీ క్లబ్ అధ్యక్షుడు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, టై అండ్ డై అధ్యక్షుడు కర్ణాటి బాలరాజు, రుద్రపాండు మహేష్, ఓం ప్రకాశ్, సతీష్ కె. ప్రసాద్, రామ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

## ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

**హాలియా జనం సాక్షి అక్టోబర్ 4:**

రానున్న వరంగల్?ఖమ్మం?నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పిలుపునిచ్చారు. హాలియా పట్టణంలో పెద్దవూర మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నోముల భగత్‌కుమార్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అర్హత కలిగిన పట్టభద్రులు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ కోఆర్డినేటర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నవంబర్ 1, 2026ను అర్హత తేదీగా పరిగణిస్తూ పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, అర్హులైన వారు నవంబర్ 6లోపు ఫారం?18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్లుగా నమోదైన వారు కూడా తాజా ఓటర్ల జాబితా కోసం తిరిగి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత నియోజకవర్గ పరిధిలో నివసిస్తూ, నవంబర్ 1, 2026 నాటికి డిగ్రీ లేదా సమానమైన విద్యార్హతను కనీసం మూడేళ్లకు ముందే పూర్తిచేసిన వారు నమోదు చేసుకోవడానికి అర్హులు



కాంగ్రెస్ పార్టీ తన యూత్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి అమలు చేయడంలో విఫలమైందని నోముల భగత్‌కుమార్ విమర్శించారు. ఈ హామీలు నెరవేరకపోవడంతో యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త సైనికుడిలా క్రమశిక్షణతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు, పార్టీ సంస్థాగత బలోపేతం, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణపై నాయకులకు పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో పెద్దవూర మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసిన కల్లూరు జూనియర్ కాలేజ్ క్లాస్మేట్ మిత్రులు



❍పూల బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానం

❍పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆహ్వానం

**కల్లూరు అక్టోబర్ 04 (జనంసాక్షి)**

తెలంగాణరాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పాటు కల్లూరు లోనిప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే సమయంలో క్లాస్మేట్స్ గా ఉన్న స్నేహితులు ఆదివారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా మంత్రికి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించాలనుకుంటున్నాం మీరు దానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంత్రి పొంగులేటిని ఆహ్వానించారు. తన వీలును బట్టి మూడు రోజుల్లో తేదీలు చెప్తానని తప్పనిసరిగా వస్తానని హామీ ఇచ్చారని హౌసింగ్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఉద్యోగి చిన్ననాటి మిత్రుడుబొగ్గుల వెంకటరామిరెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన సమయంలో సత్తుపల్లి శాసనసభ్యు రాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అక్కడే ఉండటంతో మిత్రుల్ని వారికి పరిచయం చేసారని తెలిపారు. తేదీలు ఖరారు అయిన తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రకటిస్తామని వారు తెలిపారు. మంత్రిని కలిసిన క్లాస్మేట్ మిత్రులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బొగ్గుల వెంకటరామిరెడ్డి దోసపాటి శ్రీనివాసరావు, ఎస్ డి అమిరుద్దీన్, షేక్ ఉస్మాన్ బేగ్, పెద్ద బోయిన శ్రీనివాసరావు,తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన క్లాస్మేట్ మిత్రులు పాల్గొన్నారు.



# ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ భద్రాద్రి జిల్లా నూతన కార్యవర్గం

## జిల్లా అధ్యక్షుడిగా బండి లక్ష్మణ్

**కొత్తగూడెం క్రైమ్ ,అక్టోబర్ 04(జనంసాక్షి):**

ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ ఉపాధ్యక్షులు కాల్వ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భద్రాద్రి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం నియమించారు. నూతన కార్యవర్గంలోజిల్లా అధ్యక్షుడిగా బండి లక్ష్మణ్,వర్కింగ్ ప్రెసిడెంట్గా కొత్తపల్లి సోమయ్య,ప్రధాన కార్యదర్శిగా గజ్జి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వాసుమల్ల సుందర్రావు, బండి నాగరాజు, బిల్లా సృజిత్, కార్యదర్శులుగా బండి నాగేశ్వరరావు, బండి రామచందర్, ఇస్నపల్లి నాగరాజు, కోశాధికారిగా వలమల్ల బాబురావులను నియమించారు.ఈ కార్యక్రమా నికి పట్టణ అధ్యక్షులు కాల్వ ప్రకాష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి జాతీయ ఉపాధ్యక్షులు కాల్వ భాస్కరరావు మాట్లాడుతూ సమాజంలో దళితులపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొని, వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని, సామాజిక సమానత్వం, న్యాయం కోసం నిరంతరం పోరాడాలని ఉద్బోధించారు. నూతన కార్యవర్గం భద్రాద్రి జిల్లాలో ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయ సాధనకు కృషి చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



❍ 392 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ

**బూర్గంపహాడ్ అక్టోబరు 04 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఐటీసీ అనుబంధ సంస్థ అయిన రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఉప సర్పంచ్ కె. రమేష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఐటీసీ యూనిట్ మెడికల్ అధికారి డాక్టర్ శైలేందర్ సింగ్ అధ్యక్షత వహించారు. స్థానిక ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. మొత్తం 392 మంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్.పీ. సింగ్, కార్యదర్శి డేవిడ్ ఆలివర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ, రోటరాక్ట్ సభ్యులు, కాంట్రాక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు. ఈ సందర్భంగా ఒక మహిళకు నడిచేందుకు ఇబ్బంది ఉండటాన్ని గుర్తించిన రోటరీ ప్రతినిధి యుకుంబ్, ఆమెకు నడకకు సహాయపడే వాకర్ను ఉచితంగా అందజేశారు. ఈ సేవా కార్యక్రమం స్థానికుల నుంచి ప్రశంసలు అందుకుంది.

# రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్-17 క్రికెట్కు ప్రతీక చౌదరి ఎంపిక



**పినపాక, అక్టోబర్ 04(జనంసాక్షి):**

పినపాక జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కె. ప్రతీక చౌదరి రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ అండర్?17 బాలికల క్రికెట్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన సెలక్షన్లో ప్రతీక ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆమె ఎంపికపై ప్రధానోపాధ్యాయులు డి. రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు డి. వరలక్ష్మి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కోటేశ్వరరావుకు

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శ

**అశ్వాపురం, అక్టోబర్ 4 (జనంసాక్షి):**

అనారోగ్యంతో బాధపడుతున్న పాములపల్లి గ్రామానికి చెందిన కోటేశ్వరరావును తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు.అశ్వాపురం మండలం పాములపల్లి గ్రామంలోని బట్టీల గుంపు వార్డుకు చెందిన కనీతి కృష్ణవేణి భర్త కోటేశ్వరరావు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు. అనారోగ్య పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఆత్మస్థైర్యంతో ఉండాలని సూచించారు. కోటేశ్వరరావు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితం గడపాలని ఆకాంక్షించారు. అవసరమైన సమయంలో తన వంతు సహకారం అందిస్తానని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బట్టీల గుంపు సర్పంచ్ కలివేటి సరిత, అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కేశవరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దళిత మహిళపై దాడిని తీవ్రంగా ఖండించిన ఎమ్మార్పీఎస్

## దళిత మహిళపై దాడి.. నిందితుడిని రిమాండ్ చేయాలి

**చింతపల్లి, అక్టోబర్ 04(జనంసాక్షి)**

చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో దళిత మహిళ, వీవోఏగా పనిచేస్తున్న గడిపల్లి మాధవిపై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న గ్రామసభ నిర్వహిస్తున్న సమయంలో మాజీ సర్పంచ్ కోప్పోలు అమర్నాథ్గౌడ్ తనను కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని మాధవి ఆరోపించారు.ఈ ఘటనను నిరసిస్తూ ఆదివారం చింతపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఇన్చార్జి కోళ్ల శివ మాదిగ, మాజీ అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాధిత మహిళకు న్యాయం చేయడంతోపాటు, ఘటనకు బాధ్యుడైన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్కు తరలించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రామ్మూర్తి మాట్లాడుతూ నిందితుడిని సాయంత్రంలోగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్కు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్



నాయకులు ధర్నాను విరమించారు.ఈకార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ ఇన్చార్జి మారుపాక గోపాల్ మాదిగ, చింతపల్లి మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాదిగ, పీఏపల్లి మండల అధ్యక్షుడు ఆదేపు సతీష్ మాదిగ, దేవరకొండ అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ, గుడిపల్లి అధ్యక్షుడు ఎర్ర కిరణ్ మాదిగ, మల్లేపల్లి పట్టణ అధ్యక్షుడు అందుగుల నాగరాజు మాదిగ, సీనియర్ నాయకులు వింజమూరు కృష్ణ మాదిగ, వింజమూరు రవి, చెట్టిపల్లి రవీందర్, ఎర్ర వెంకటయ్య, ఎర్ర జగన్, మాసని పెద్దయ్య, గార్లపాటి మలయ్య, పోలే లాలయ్య, జోగు కిరణ్, ఎలిమినేటి నర్సింహా, వింజమూరు కృష్ణ, హరికంటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు....



# ఖమ్మంలో పుస్తక ఆవిష్కరణ, కవి సమ్మేళనం

## పాగి వెంకన్న, బొమ్మెర ముత్యంలకు సత్కారం



**ఖమ్మం, అక్టోబర్ 04 (జనంసాక్షి):** వికాస వేదిక సాహిత్య సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ప్రముఖ రచయిత డాక్టర్ కాసర్ల రంగారావు రచించిన నాలుగు పుస్తకాల పరిచయ కార్యక్రమం, కళాకారుల సన్మానం మరియు కవి సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ భాష, సాహిత్యాలు సమాజ పురోగతికి మూలస్తంభాలని, అక్షర సాధన ద్వారానే సమాజంలో చైతన్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సాహిత్యం గొప్పదనం గురించి అతిథులు వికాస వేదిక సాహిత్య సంస్థ ప్రతినిధులు, గొప్పగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బుక్కా సత్యనారాయణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కాసర్ల రంగారావు కలం నుండి జాలువారిన నాలుగు పుస్తకాలను ఆవిష్కరించి పరిచయం చేశారు. అలాగే ఖమ్మం జిల్లా కళాకారుల సంఘం ఎన్నికల్లో నూతనంగా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన పాగి వెంకన్న, బొమ్మెర ముత్యంలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనానికి కోలారాములు, మలిశెట్టి కృష్ణమూర్తి, ఎస్ కె మోహినొద్దీన్, నలుబోల మధుశ్రీ, మందుల వీరభద్రం, వి. నరసింహారావు, రెంటాల చిన్న హుస్సేన్, శోభనాద్రి, హాలావత్ సీత్లా నాయక్, బి. నాగేశ్వరరావు, బి. సుశీరా, యస్.కె. మోహిద్దీన్, చింతమళ్ళ సునీత, కె. వసంత, కొత్తపల్లి కృష్ణారావు, కొంపెల్లి రామయ్య, అంగోతు జయవాసు, యం. వీర వెంకటరెడ్డి అధ్యక్షత వహించి కవితాగానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యాతిథులుగా డాక్టర్ కాసర్ల రంగారావు, ఎన్. కాంతేశ్వరరావు, జి. లెనిన్ శ్రీనివాస్, యడవల్లి శైలజశ్రీనివాస్, తోటపల్లి సృజన్ కుమార్, గాజుల భారతిశ్రీనివాస్, తిరునగరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను డి. శ్రీకాంత్, సిహెచ్. వీరబాబు, పి. రమేష్ బాబు, రేళ్ళ శ్రీనివాస్, గోవింద్ విజయవంతంగా నిర్వహించారు.

# కడుపునొప్పితో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 4 (జనంసాక్షి):** తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని శెట్టి రూప శ్రీదుర్గ (16) ఆత్మహత్య చేసుకున్న ఘటన పాల్వంచ మండలం సత్యనారాయణపురంలో చోటుచేసుకుంది. మూడు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు పాల్వంచ, కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించినా ఉపశమనం లభించలేదు. శనివారం తండ్రికి భోజనం వడ్డించిన అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్న ఆమె ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. సాయంత్రం తండ్రి పిలిచినా స్పందించకపోవడంతో కిటికీ అద్దం పగులగొట్టి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు ఆర్‌ఎంపీ వైద్యుడు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సురేష్ తెలిపారు.

# పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

## మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు




**నేరేడుచర్ల అక్టోబరు 04 (జనంసాక్షి)**

పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సంక్షుభిత పరిస్థితుల్లో మనమందరం అత్యంత కీలకమైన అంశంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తీవ్రమైన ఎల్‌నినో వాతావరణ ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందన్నారు. ఎండల తీవ్రత విపరీతంగా పెరగడంతో భూమి వేడెక్కి, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని తెలిపారు. ప్రతి నీటి బొట్టు భవిష్యత్తుకు రక్షణే అని, మిషన్ భగీరథ ద్వారా వస్తున్న తాగునీటిని అవసరమైన మేరకు మాత్రమే వాడుకోవాలన్నారు. ప్రతి ఇంటి నల్లాకు తప్పనిసరిగా ట్యాపులు బిగించుకోవాలని, నీటిని వృథాగా రోడ్లపైకి, కాలువల్లోకి వదలకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఇష్టానుసారంగా నీటిని వృథా చేస్తే, రాబోయే కాలంలో మున్సిపాలిటీ తరపున కఠినమైన ఆంక్షలు, చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని ప్రజలందరూ ఈ తీవ్రతను గుర్తించి, నీటి సంరక్షణలో మున్సిపల్ యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఇంటింటికి వర్షపు నీటి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకొని, నీటి సంరక్షణ కాపాడి భావితరాలకు భరోసా ఇద్దామన్నారు.

# భద్రాద్రిలో వైభవంగా గోదావరి నదీహారతి: పితృపక్షాల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి



**భద్రాచలం అక్టోబరు 04 (జనంసాక్షి)**

పితృముక్తి క్షేత్రమైన భద్రాచలంలో మహాలయ పితృపక్షాల సందర్భంగా పుణ్య గోదావరి మాతకు ఆదివారం దివ్య నదీహారతి వైభవంగా నిర్వహించారు. భద్రాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యంలో గోదావరి కరకట్ట వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. భద్రాద్రి పురోహితుల సంఘం అధ్యక్షుడు రామవజ్జల రవికుమార్ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైన పవిత్ర భద్రాచల క్షేత్రంలో గోదావరి నదికి హారతి ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు నదీ హారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ నిర్వహించి, అనంతరం జై శ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం చేపట్టారు. పూజా ద్రవ్యాలతో గోదావరి మాతకు అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పఠిస్తుండగా భక్తులు 'ఓం శ్రీరామాయ నమః' అంటూ 108 సార్లు శ్రీరామ నామ స్మరణ చేశారు. అనంతరం సీతారామ చంద్రస్వామివారికి 12 సార్లు, గోదావరి మాతకు 21 సార్లు హారతి సమర్పించారు. లోకకల్యాణం కోసం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ నదీహారతి కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని రామవజ్జల రవికుమార్ తెలిపారు. తెలుగు రాష్ట్రాలు అన్ని రంగాల్లో సస్యశ్యామలం కావాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని గోదావరి మాతను ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాంతి మంత్ర పఠనం నిర్వహించి భక్తులకు పులిహోర ప్రసాదం, నైవేద్యం, శనగలు పంపిణీ చేశారు. నదీహారతి కార్యక్రమానికి అవసరమైన పూజా సామగ్రిని భద్రాద్రి పురోహితుల సంఘం సమకూర్చింది. ఈ కార్యక్రమంలో సత్యప్రసాద్ శర్మ, వీరభద్ర శర్మ, రామాచార్యులు, తేజ శర్మ, చంద్రశేఖర్ శర్మ, తిరుపతిరావు, శివ తదితర పురోహితులు హారతులు సమర్పించారు. సత్యనారాయణ రెడ్డి, మహిళా భక్తులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

## ఆదివాసీలకు వైద్య పరీక్షలు.. మందులు, దుస్తులు, దుప్పట్ల పంపిణీ





**బూర్గంపహాడ్ అక్టోబరు 04 (జనంసాక్షి)**

సానికొమ్ము కృష్ణారెడ్డి 24వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బూర్గంపహాడ్ మండలం సారపాక పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం పాయం ఎస్టీ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు జక్కం రవీంద్ర, నీరజ్ ఆధ్వర్యంలో సుమారు 350 మంది ఆదివాసీ గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం శిబిరానికి హాజరైన వారందరికీ కుటుంబ సభ్యులు భోజన సదుపాయం కల్పించారు. గ్రామం లోని కుటుంబాలకు దుప్పట్లు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. కృష్ణారెడ్డి సోదరులు సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, జయరాంరెడ్డి, ఆయన కుమారుడు రామిరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏటా ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివాసీ గిరిజనులకు వైద్య సేవలు అందించడం, భోజనాలు ఏర్పాటు చేయడం, అవసరమైన వారికి దుప్పట్లు, చిన్నారులకు దుస్తులు అందించడం ఎంతో సంతృప్తినిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమం కృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నిర్వహించినట్లు తెలిపారు.

# తెలంగాణ కథా సాహిత్యం చారిత్రాత్మకమైంది : డా.నందిని సిధారెడ్డి



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 4 (జనంసాక్షి )**

తెలంగాణ కథా సాహిత్యం చారిత్రాత్మకమైనది, జీవితమంత విశాలమైనదని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి రచయిత కథకులు తెలంగాణ సాహిత్య అకాడెమీ పూర్వ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం నాడు ఖమ్మం కథా స్ఫూర్తి సాహిత్య ఉత్సవం , వేదిక ఫంక్షన్ హాల్లో కథా తెలంగాణ ప్రత్యేక కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ధరణికోట రమేష్ కుమార్,ప్రసేన్ సీతారాం రవి మారుత్ సంపాదకత్వంలో వెలువడిన గుమ్మి తెలంగాణ కథా సంకలనాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ కథ విస్మరణ కు గురైందని ఆయన ఆవేదన చెందారు. తెలుగుకథలో తెలంగాణ కథా ఉంటుందని2003లోనే తెలంగాణ కథా సంకలనాన్ని కర్రమల్లారెడ్డి వెలువరించిన నేపథ్యం ఉందన్నారు ఆ తరువాత సంగిశెట్టి శ్రీనివాస్,వెల్దండి శ్రీధర్ సంపాదకత్వలో తెలంగాణ కథను ముందుకు తెచ్చారన్నారు. దళిత, మైనార్టీ, ఆదివాసీల కథలు వస్తున్నాయని వెల్లడించారు. తెలంగాణ సాహిత్య గుమ్మం ఖమ్మం తెలంగాణ తొలి మలిదశల ఉద్యమం జరిగిన ఖమ్మం నుంచి గుమ్మి కథా సంకలనం రావడం చారిత్రాత్మకమైన అంశంగా అభివర్ణించారు. తొలుత కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు కవి, విమర్శకులు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో ఖమ్మం కథా స్ఫూర్తి వేదిక కార్యదర్శి ధరణికోట రమేష్ కుమార్ లక్ష్యప్రకటనలో భాగంగా తెలంగాణ లో కథలేదనే విమర్శకు ధీటుగా కథ ఎంత విస్తృతంగా ఈ ప్రాంతంనుంచి వచ్చిందో తెలపడానికి గుమ్మి కథా తెలంగాణ ని తీసుకురావడంతో పాటు ఈసంవత్సరం నుంచి కథా పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ కథా పూర్వ వైభవాన్ని సాహిత్య ప్రస్థానాన్ని ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రముఖ కవి విమర్శకులు తెలంగాణ సాహిత్య చరిత్ర రచయిత డా.సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు కంటే ముందు నుంచి తెలంగాణ కథ మొదలైన చారిత్రక సామాజిక రాజకీయ సాంస్కృతిక విభిన్నతను సోదాహరణంగా వివరించారు. ప్రముఖ కథకులు ఆడెపు లక్ష్మీపతి తెలంగాణ కథా వస్తువైవిధ్యం శిల్పప్రత్యేకతల్ని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కథారచయిత శిరంశెట్టి కాంతారావు తెలంగాణ కథ-కొత్త స్వరాలు అనే అంశంపై మాట్లాడారు. కుప్పిలి పద్మ, ఆప్త వాక్యం పలికారు. కవి కథకులు వంశీ క్రృష్ణ గుమ్మికథల ను సమీక్షించారు సంపాదకులు రవిమారుత్, సీతారాం సంకలనం వెలువరించిన నేపథ్యాన్ని ప్రాధాన్యతలను తెలిపారు..రెండవసెషన్ లో గుమ్మి సంకలనంలో కథలు రాసిన 11మంది రచయితలు తమ కథల నేపథ్యాన్ని వివరించారు . తెలంగాణ కథ గమనం గమ్యం పానెల్ చర్చలో కొండపల్లి నీహారిణి బి.వివిఎన్ స్వామి నెల్లుట్లరమాదేవి తెలంగాణ కథ భాషా నిర్మాణం శైలి అభివ్యక్తి తెలంగాణ వర్తమాన కథకులవిశిష్టతలను చర్చలో భాగంగా విశ్లేషించారు. నలుగురికి కథాపురస్కారాల ప్రదానం చేశారు. కార్యక్రమంలో కథారచయితలు మన్ ప్రీత్, అరుణ్ మన్నెఏలియా , అరుణ్ కుమార్,సిద్దెంకి యాదగిరి,గుడిపల్లినిరంజన్ వనపట్ల సుబ్బయ్య ఎదిరేపల్లి కాశన్న తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు రచయితలు, స్థానిక కవులు ఇబ్రహీం నిర్గుణ్ శ్రీనివాస్ సూఫి, కన్నెగంటి వెంకటయ్య,నామా పురుషోత్తం,దాసరోజు శ్రీనివాస్, తోటి సుభాషిణి, మువ్వా జయశ్రీ, ఫణి మాధవి, రౌతు రవి,ఎన్.తిర్మల్ తదితర సాహిత్యాభిమానులు తదితరులు పాల్గొన్నారు .

## తెలంగాణ తొలితరం రచయిత హీరాలాల్ మోరియా!

### కవి సాదనాల



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 4 (జనంసాక్షి)**

తెలంగాణా తొలితరం ఉద్యమ రచయిత,కవి హీరాలాల్ మోరియా అని వికాసం వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాదనాల వెంకటస్వామి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులోప్రముఖ కవి, రచయిత ఎన్.తిర్మల్ రాసిన, తపస్వి మనోహరం ప్రచురించిన" త్రిభాషా కవి హీరాలాల్ మోరియా"అన్న పుస్తకం ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. తెలంగాణా ఉద్యమం నుండి ఉపన్యాసకుడు గా,ఉద్యమకారుడు గా,పాత్రికేయుడుగా బహుముఖ పాత్ర నిర్వహించిన మోరియా మూడు భాషల్లో కవిత్వం,కథలు, వ్యాసాలు, నవలలు రాసిన మహారచయిత గా కీర్తించారు.బహుబాషా రచయిత గా మోరియా దేశవ్యాప్తంగా కీర్తి గడించారని అన్నారు.హీరాలాల్ మోరియా ఉర్దూ రచయితల్లో గుర్తింపు కలిగిన రచయిత మాత్రమేకాక, తెలుగు,హిందీ భాషా సాహిత్యానికి ఎనలేనిసేవలు అందించారని అన్నారు.ఖమ్మం జిల్లా సాహిత్య ఉద్యమానికి హీరాలాల్ మోరియా ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఖమ్మం జిల్లా రచయితలసంఘానికి అధ్యక్షుడు గా సుదీర్ఘ కాలం పనిచేయడం తోపాటు, ఖమ్మం నుండి ఆయన శాసనమండలి సభ్యుడు గా సాహిత్య అకాడమీ సలహాదారుగా అనేక సామాజిక,సాహిత్య సేవలు అందించారని అన్నారు.ఆయనరాసిన షాకే గుల్,జాకమ్ బోల్తాహై, ఉర్దూ కవితా సంకలనం తో పాటు ఉర్దూలో రామాయణం రెండు సంపుటాలు రాసి ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారని అన్నారు.దర్తీకా పుకార్ హిందీ కధాసంకలనం,గుడి మెట్లునవలతో పాటు,ఆయన సమాంతర రేఖలు నాటకం ఎంతో ప్రశస్తి పొందిందని అన్నారు.సర్దార్ జమలాపురం కేశవరావు మహాపరాధం జీవితం చరిత్రతో పాటు, సుమారు వందమంది ముస్లిం స్వతంత్ర యోధులు పరిచయం అయిన చేశారని పేర్కొన్నారు.వికాసవేదిక ఆద్వర్యంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం కు బుక్కా సత్యనారాయణ అధ్యక్షత వహించారు.సభలో ప్రముఖ రచయిత ఎన్.తిర్మల్, అరసం రాష్ట్ర నేత పల్లేర్ల వీరాస్వామి,వికాస వేదిక నేతలు లెనిన్ శ్రీనివాస్, డాక్టర్ కాసర్ల రంగారావు, తిరునగరి శైలజ శ్రీనివాస్ ప్రముఖ సాహితీవేత్త అమ్మిన శ్రీనివాసరాజు తదితరులు ప్రసంగించారు.

## విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న పాలకులపై సమరశీల పోరాటాలు

**ఖమ్మం, (జనంసాక్షి) :**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై విద్యార్థి లోకం సమరశీల పోరాటాలు నిర్మించాలని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తిప్పారపు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో బి.స్టాలిన్ అధ్యక్షతన పీడీఎస్‌యూ నగర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిప్పారపు లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరిస్తూ, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. విశ్వవిద్యాలయాల్లో సరిపడా నిధులు కేటాయించకపోవడం, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్నత విద్య సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కేంద్రం బడుల అభివృద్ధిని విస్మరించి గుడుల అభివృద్ధిపైనే దృష్టి సారిస్తోందని ఆక్షేపించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సుమారు రూ.10,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థుల ఉన్నత చదువులను కాలరాస్తోందని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు మౌలిక వసతుల లేమితో అల్లాడుతున్నారని, అధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని కేటాయించడంతో పాటు కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నగర నాయకులు కార్తీక్ రెడ్డి, పాండవుల సుశాంత్, సిద్ధు, శ్రీనాథ్, బాలు, చరణ్, ప్రవీణ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 8న అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

**పినపాక, అక్టోబర్ 04(జనంసాక్షి):**



ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 8వ తేదీన అఖిలపక్షం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పత్తిపాటి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పిరపాక మండలం ఈ భయ్యారం క్రాస్ రోడ్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి అఖిలపక్ష నాయకులు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ కు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తమ అభ్యంతరాలను ప్రజా స్వామ్య పద్ధతిలో తెలియజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తమకు ఉన్న అభిప్రాయాలను నిరసన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్, సీపీఐతో పాటు అఖిలపక్షంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసు కోవాలని నాయకులు కోరారు. ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే తమ డిమాండ్‌ను జిల్లా అధికారుల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. అఖిలపక్ష సమావేశంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి, లక్ష్మీరెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదింటి కలను సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం - కొట్టే పద్మ సైదేశ్వరావు

**మేళ్లచెరువు జనంసాక్షి :**

మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో, మాజీ ఎంపీపీ కొట్టే పద్మ సైదేశ్వరావు కృషితో గ్రామానికి పైలెట్ ప్రాజెక్టు కింద 200 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన గంగోలు మస్తాన్ రావు నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ కొట్టే పద్మ సైదేశ్వరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటి కలను సాకారం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు రంగిశెట్టి వెంకయ్య, గ్రామ కాంగ్రెస్ నాయకులు కొట్టే రామారావు, కొట్టే మాధవరావు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ఎస్ఐ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కొరకు ఎంపిక పరీక్ష

**○జిల్లాలోని 4 పరీక్షా కేంద్రాల్లో హాజరైన 1220 అభ్యర్థులు**

**○ఎంపిక పరీక్ష సరళని పరిశీలించిన జిల్లా ఎస్పీ కె.నరసింహ**

**సూర్యాపేట(జనంసాక్షి):**



ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అందించనున్న 45 రోజుల ఉచిత శిక్షణలో అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 4 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. సూర్యాపేట ఎస్వీ డిగ్రీ కళాశాల, కోదాడ కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్ గ్రీన్‌వుడ్ పాఠశాల, తిరుమలగిరి జిల్లా పరిషత్ పాఠశాలలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించారు.సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె.నరసింహ సందర్శించి పరీక్ష సరళి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ప్రత్యేక చొరవ, జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 45 రోజుల ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తునట్ల తెలిపారు. ముందస్తు రిజిస్ట్రేషన్ ద్వారా 1600 మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకోగా, 1,220 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా ఇలాంటి శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని పోలీసు ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఎస్పీ వెంట ట్రైనీ ఐఏఎస్ అనూష , సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు,టౌన్ సీఐ వెంకటయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు, డిప్యూటీ తహసీల్దార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అంకిరెడ్డి చిట్టెమ్మ మృతికి ప్రముఖుల నివాళులు

## నివాళులర్పించిన మంత్రి పొంగిలేటి, ఎమ్మెల్యే జారె

**చండ్రుగొండ, అక్టోబర్ 4 (జనంసాక్షి):** మాజీ జెడ్పీటీసీ అంకిరెడ్డి కృష్ణారెడ్డి తల్లి అంకిరెడ్డి చిట్టెమ్మ (86) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మువ్వా విజయబాబు తదితరులు సందర్శించి నివాళు లర్పించారు.అనంతరం అంకిరెడ్డి కృష్ణారెడ్డిని పరామర్శించి, చిట్టెమ్మ మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.చిట్టెమ్మ మృతి విషయం తెలుసుకున్న చండ్రుగొండ మండల కాంగ్రెస్ నాయకులు భోజ్యా నాయక్, తుమ్మలపల్లి సురేష్, సారేపల్లి శేఖర్, గుగులోతు బాబు, కిరణ్ రెడ్డి, మహేష్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.





## ఘ్యారమీ పండుగ శుభాకాంక్షలు

**ఖమ్మం, (జనంసాక్షి) :** 8వ డివిజన్‌లో ఘ్యారమీ పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకుడు భూక్యా అశోక్ ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘ్యారమీ పండుగ ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు. మతాలు వేరైనా ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని అన్నారు. 8వ డివిజన్‌లో మత సామరస్యం, సోదరభావం కొనసాగడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఐక్యతే ప్రాంత అభివృద్ధికి బలమని భూక్యా అశోక్ అన్నారు.



## కోహెన్స్ లైఫ్ సెన్సెస్ సేవలు అభినందనీయం

**సూర్యాపేట (జనంసాక్షి):** కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకటరమణతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు కోహెన్స్ లైఫ్ సెన్సెస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులను అందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధారవత్ విజయ నాయక్, లింగ నాయక్, శ్రీహాన్ హాస్పిటల్ డాక్టర్ గిరిధర్ రెడ్డి, విజిత రెడ్డి, అర్థో వెంకటేష్,కోహెన్స్ లైఫ్ సెన్సెస్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 4 (జనంసాక్షి):** ఇంద్రియాల గ్రామంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. గారిసే పెద్ద నరసింహకు రూ.35 వేలు, బోయిని గంగయ్యకు రూ.15,500 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పానుగంటి లింగస్వామి, నాయకులు దొడ్డి సుధాకర్, బద్దం రాజేశ్వర్, పావిరాల దయాకర్, ఎర్ర మహేందర్, గారిసే మల్లేష్, మొగిలిపాక శంకరయ్య, మొగిలిపాక ముకేశ్, కుందారపు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.





కామంచికల్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు

# అండగా నిలిచిన మంత్రి పొంగులేటి

## తీర్థాలలో మూడు కుటుంబాలకు పరామర్శ

**ఖమ్మం రూరల్, అక్టోబర్ 4 (జనంసాక్షి):** ఇటీవల వ్యవసాయ కూలి పనులకు వెళ్లి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కామంచికల్ గ్రామానికి చెందిన దొంతుసరుపు భారతమ్మ నివాసానికి వెళ్లి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం నివాళు లర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే...ఆ ప్రమాదంలో గాయపడిన మరో 11 మంది కూలీలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ ఈ కుటుంబాలకు తన వంతు సహకారం అందిస్తూ.. ఉండగా నిలుస్తానని అభయం ఇచ్చారు.తీర్థాల గ్రామంలో ఇటీవలి కాలంలో వివిధ కారణాలతో చనిపోయిన బానోత్ శాంత, ఎస్ కే. అశ్వాన్, శీతల నాగరాజు ఇళ్లకు వెళ్లి.. వారి చిత్రపటాల వద్ద మంత్రి పొంగులేటి నివాళు లర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కల్లెం వెంకటరెడ్డి, నాయకులు ప్రతాపనేని రఘు, బోడా వెంకన్న, కిరణ్ కుమార్ నాయక్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## సర్ ను రద్దు చేయాలి : అఖిల పక్షం డిమాండ్

**పెనుబల్లి అక్టోబర్ 4 (జనంసాక్షి ):** భారత రాజ్యాంగం పై విశ్వాసం లేని బీజేపీ ప్రభుత్వం చేపట్టే పౌరుల ఓటుహక్కును తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా డిమాండ్ తో ఆదివారం పెనుబల్లి మండలం వంగా ముత్యాల బంజరలో సమావేశం జరిగింది.ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) కు వ్యతిరేకంగా అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం ముందు ధర్నాతో పాటు అక్టోబరు 8 న చలో రాజ భవన్ , నవంబరు ఒకటిన చలో ఢిల్లీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షుడు జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్,సీపీఐ ( ఎం), సీపీఐ, ఎం ఎల్ మాస్ లైన్ నాయకులు చలమాల విఠల్ రావు, పాదిల భాస్కర్,బీరెల్లి లాజర్,కాటినేని శ్రీనివాసరావు, చిట్టిమోదుల కృష్ణ, రాధా కృష్ణ, ఈడా కమలాకర్ రావు, కీసర శ్రీనివాసరెడ్డి,గుడూరు మాధవ రెడ్డి,మేకతొట్టి కాంతయ్య,తాళ్లూరి శేఖర్ ,వంగా గిరిజాపతిరావు,వంగా చంద్ర శేఖర్ ,అరుణ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్తగూడెంలో మెరిసిన ఆణిముత్యం

### ఫిజికల్ ఎడ్యుకేషన్ లో పిహెచ్.డి డాక్టరేట్



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 4 (జనంసాక్షి):** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 20 వ వార్డు ముత్తగూడెంకి చెందిన గూడె నరసింహారావు కాకతీయ యూనివర్సిటీ నుండి పిహెచ్.డి ( డాక్టరేట్ )పట్టా పొంది గ్రామంలో ఆణిముత్యంలా మెరిశారు.ముత్తగూడెంకు చెందిన గూడె పర్వతాలు కుమారుడు గూడె నరసింహారావు మధిరలోని టి.వి.ఎం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు.ఒక పక్క ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదవాలన్న ఆశయంతో కాకతీయ యూనివర్సిటీ నుండి ఫిజికల్ ఎడ్యుకేషన్ లో వరంగల్ ఎన్.ఐ.టి ప్రొఫెసర్ డాక్టర్ పి.రవికుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి పిహెచ్.డి (డాక్టరేట్ ) పట్టా పొంది పలువురికి ఆదర్శంగా నిలిచారు.

## కోల్ ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు లాభాలలో వాటా ఇవ్వాలి

### ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు తోడేటి నాగేశ్వరరావు



**టేకులపల్లి, అక్టోబర్ 4(జనంసాక్షి):** సింగరేణి సంస్థ 2025-2026 వార్షిక లాభాలలో కోల్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు లాభాలలో వాటా బోనస్ పది శాతం ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ( ఐ ఎఫ్ టి యు)రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు,జిల్లా కార్యదర్శి రామ్ మోహన్ రావు డిమాండ్ చేశారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్ నుండి వివిధ ప్రాంతాలకు బొగ్గు సరఫరా చేస్తున్న ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ల సమావేశం మోరే వెంకటేష్ అధ్యక్షతన ఆదివారం టేకులపల్లి లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్పత్తితో పాటు ట్రాన్స్పోర్ట్ లో ప్రధాన భూమిక పోషిస్తున్న కోలు ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లకు సింగరేణి లాభాలలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలు, మోరే వెంకటేష్,చిరంజీవి, ప్రశాంత్,అశోక్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట నియోజకవర్గ రచయితల సంఘం ఆవిర్భావం



**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2 లో ప్రముఖ కవి, రచయిత, మనం వికాస్ వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ అధ్యక్షతన జరిగిన రచయితలు, కవుల సమావేశంలో సూర్యాపేట నియోజకవర్గ రచయితల సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు గణేష్ పేర్కొన్నారు. జిల్లాలో సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న సాహితివేత్తలను, రచయితలను, కవులను కళాకారులను ఏకతాటిపై నడిపించడానికి రచయితల సంఘం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రచయితలు, కవులు సమాజాన్ని మేల్కొలిపే విధంగా రచనలు చేసేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రచనలు వెలుగులోకి తెచ్చిసమాజం చైతన్యానికి రచయితల సంఘం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సూర్యాపేట నియోజకవర్గ రచయితల సంఘం అధ్యక్షులుగా శీలా అవిలేను, ప్రధాన కార్యదర్శిగా గొడితాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పబ్బతి వెంకటేశ్వర్లు, పోతుగంటి వీరాచారి, కార్యదర్శులుగా మెంతబోయిన సైదులు, ఏబెల్ శశి, మహిళా కార్యదర్శి గా ఎన్.సి.రోజా, కార్యవర్గ సభ్యులుగా గడ్డం కృష్ణారెడ్డి,ఆలకుంట్ల లింగయ్య,కందుకూరి యాదగిరి,లింగాల శ్రీనివాస్,విజయ్ కుమార్, మంజు భార్గవి, షేక్ అలీమొద్దీన్, కుసుమ సిద్ధారెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షులుగా సీనియర్ రచయిత బెల్లంకొండ శ్రీరాములును ఎన్నుకున్నట్లు తెలిపారు.

## షరతుల్లేకుండా గీత కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలి

○యాదాద్రి కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

○గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోలగాని జయరాములు



**మోటకొండూరు, సెప్టెంబర్ 4 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇస్తున్న పెన్షన్ విషయంలో ఎలాంటి షరతులు, నిబంధనలు లేకుండా అర్హులైన వారందరికీ మంజూరు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోలగాని జయరాములు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టనున్న ధర్నాలో జిల్లాలోని గీత కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం మోట కొండూరు మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం తండా రంగయ్య గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జయరాములు పాల్గొని మాట్లాడుతూ.. చేతివృత్తులలో కల్లుగీత అత్యంత ప్రమాదకరమైనదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబ పోషణ కోసం కార్మికులు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను అరచేతి లో పెట్టుకుని పనిచేసే ఇటువంటి వృత్తికి ప్రభుత్వం రక్షణ, సంక్షేమం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. సంఘం నాయకులు చేసిన అనేక పోరాటాల ఫలితంగానే ప్రభుత్వాలు గీత కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాయని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం అనేక కొత్త నిబంధనలు, షరతులు విధించడం వల్ల అర్హులైన ఎంతోమంది గీత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే పునరా లోచించి ఆ నిబంధనలను తొలగించాలన్నారు. అలాగే, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గీతన్నల పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంచి తక్షణమే అమలు చేయా లని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమా వేశంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు గాజుల బాలరాజు, ఉపాధ్యక్షుడు లోడె ఉప్పలయ్య, సంఘం నాయకులు తండా రాములు, తాళ్లపల్లి వెంకటయ్య, సీసా ఇస్తారి, రుద్రబోయిన మల్లేష్, వంగాల చంద్రమౌళి, దూడల శ్రీనివాస్, గడ్డం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి గోవుల తరలింపు.. అధికారుల నిఘా ఏదీ?



**చీకటి మాటున గోవుల రవాణాపై అనుమానాలు..**
**గ్రామాల్లో కలకలం**
**అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజల డిమాండ్**

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 4 (జనంసాక్షి):** మండల పరిది లో అర్ధరాత్రి వేళ గోవులను తరలిస్తున్న ఘటనలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.

సాధారణంగా పగటి వేళల్లో కాకుండా రాత్రి సమయంలో గోవులను వాహనాల్లో తరలించడంపై గ్రామస్థుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోవుల తరలింపునకు సంబంధించి నిబంధనలు పాటిస్తున్నారా? అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రాత్రివేళ గోవులను తరలిస్తున్న వాహనాలపై సంబంధిత అధికారులు, పోలీసులు నిఘా పెంచాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారులు, గ్రామీణ మార్గాల్లో రాత్రి సమయంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని వారు పేర్కొంటున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి**

గోవుల రవాణాకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది అధికారులు తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో చట్టబద్ధంగా రవాణా చేస్తున్న వారిపై అనవసరంగా అనుమానాలు రాకుండా అధికారులు వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నారు.

**అధికారుల నిఘా అవసరం**

అర్ధరాత్రి సమయంలో జరుగుతున్న గోవుల రవాణాపై సంబంధిత శాఖలు సమన్వయంతో నిఘా పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి, గోవుల తరలింపునకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు తెరదించేందుకు అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

## వార్డ్ మెంబర్ల ఫోరం మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 04 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వార్డ్ మెంబర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఆదేశాల మేరకు, రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరి (సాగర్) మండల వార్డ్ మెంబర్ల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా రమావత్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా శాగం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆంగోతు సర్దార్ నాయక్ లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తాడూరు రాజయ్య చారి, దుగ్గే శివప్రసాద్, మెగావత్ శ్రీరాములు, సహాయ కార్యదర్శులుగా చిట్యాల సాయి, ధనావత్ లక్ష్మి, యూత్ అధ్యక్షుడిగా ఆంగోతు ముని నాయక్, మహిళా అధ్యక్షురాలిగా కటికర్ల సౌందర్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జున రెడ్డి మాట్లాడుతూ వార్డ్ మెంబర్ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి అవకాశాల కోసం ఫోరం ఐక్యంగా కృషి చేస్తుందని తెలిపారు. వార్డ్ మెంబర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని వార్డ్ మెంబర్లు, ఫోరం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే బ్రహ్మాస్త్రం

### ఎస్సై కుమారస్వామి యాదవ్

**మోటకొండూరు, అక్టోబర్ 4 (జనంసాక్షి):** నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలకమని మోటకొండూరు ఎస్సై కుమారస్వామి యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో వ్యాపారస్తులతో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటు, పాత కెమెరాల మరమ్మతుల కార్యక్రమం నిర్వహించారు. పనిచేయని కెమెరాలను గుర్తించి మరమ్మతులు చేయించడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త కెమెరాల ఏర్పాటుకు షాపుల యజమానులతో సమన్వయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు పోలీసులకు మూడో కన్నులాంటివని, దొంగతనాలు, ఆకతాయిల చేష్టలు, రోడ్డు ప్రమాదాల్లో నిందితులను గుర్తించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి వ్యాపారి సామాజిక బాధ్యతగా షాపుల లోపల, బయట కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వర్తక సంఘం ప్రతినిధులు, షాపుల యజమానులు పాల్గొన్నారు.




## ఘనంగా మాజీ జడ్పీ చైర్మన్ వేమవరం ప్రసన్న-రత్నాకర్ బాబు వర్ధంతి వేడుకలు

### - నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



రామన్నపేట, అక్టోబర్ 4 (జనంసాక్షి): ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్గీయ వేమవరం ప్రసన్న?రత్నాకర్ బాబు దంపతుల 23వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జనంపల్లి గ్రామంలో స్వర్గీయ వేమవరం ప్రసన్న – రత్నాకర్ దంపతుల వర్ధంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లా అభివృద్ధికి వేమవరం ప్రసన్న?రత్నాకర్ బాబు చేసిన సేవలను కొనియాడారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేస్తూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సేవలందించిన సమయంలో ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు.

వారు జీవించి ఉంటే ప్రజాప్రతినిధులుగా రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పలు పదవులు చేపట్టేవారని లింగయ్య పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జనంపల్లి గ్రామ అభివృద్ధికి కూడా ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అప్పట్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి చేపట్టడం ఎంతో కష్టతరమైనప్పటికీ, జిల్లా నాయకుల అందరి మన్ననలు పొందుతూ చిరునవ్వుతో బాధ్యతలు నిర్వర్తించేవారని అన్నారు. జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నాయకులని, వేమవరం ప్రసన్న?రత్నాకర్ బాబు లేని లోటును వారి మరణానంతరం జిల్లా పరిషత్ సభ్యులుగా వేమవరపు మనోహర పంతులు, మండల ప్రాదేశిక సభ్యులుగా సుధీర్‌బాబు ప్రజాసేవ ఎంతో చేశారని, ఇలాంటి నాయకులు మనకు ఎంతో అవసరం అని ప్రజలు ఆదరణ చూపాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించి ప్రజల ఆశీస్సులు పొందాలని చిరుమర్తి లింగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కంభంపాటి శ్రీనివాస్ గౌడ్, గర్దాస్ విక్రమ్, మాజీ మండల అధ్యక్షులు పోచబోయిన మల్లేశం, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, పిట్ట కృష్ణారెడ్డి, అంబటి రవీందర్ రెడ్డి, పులిపలుపుల వీరస్వామి, ఇడెం రాధా శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి,బందెల రాములు, కన్నెబోయిన బలరాం, ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి,మిరియాల మల్లేశం, పిట్ట కృష్ణారెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, భూసాని రాజు తదితరులు పాల్గొన్నారు.